# [illegible]

■ వి.ఆర్. రాసాని

తూర్పు కొండ ధరించిన కిరీటంలా ధగధగా మెరిసిపోతూ... ఆకాశం అబల తొడిగిన మబ్బుల రవికెలో అద్దంలా సూర్యుడు.

ఉషోదయ వేళ కాస్తున్న సూర్యుడి ఎండలో నును వెచ్చదనం.

సన్నగా కురుస్తున్న మంచు గుండెల్లో బాణంలా ఎండ.

విరిసీవిరియని కంది చెట్ల చిగుళ్ళలో పూలపూల ఎండ.

అలనంద, పెసర తీగల్లో తెల్లబోయిన తెల్లపూల ఎండ.

చెనిగ చెట్లల్లో ఎగిరిపడిన ఎర్రపూల ఎండ.

మళ్ళ గనాలలో పచ్చటి గరికపోచల ఎండ.

బావిగట్టునున్న ఆకులపైన, కానుగు కొమ్మలపైన... మంచుబిందువుల్లో కలిసిపోయి మిలమిలలాడే ఎండ.

చ్యాడపెట్టిన మడిలో నీటి అద్దంపైన తళతళలాడిపోతూ మెరిసిపోయే ఎండ...

నాట్లు వేయడానికి వచ్చిన ఆడవాళ్ళు చీరలు ఎగచెక్కి మళ్ళలో దిగగానే, వాళ్ళ పాదాల కిందపడి గలగలా నీటిలో కదలిపోయి అల్లాడిపోయి భంగపడిపోయిన ఎండ.

మడి నీళ్ళలో బారకొక్కటి చొప్పున వెన్నెల కుప్పలు పెట్టినట్టు కనిపిస్తున్న నారుకట్టలు నీటిలో తమ బింబాల్ని చూసుకొని మురిసిపోతున్నాయి.

రెండు రోజుల క్రితమే చ్యాడ పెట్టి దున్ని, ఆకు తొక్కి, నాట్లకు సిద్ధం చేసుకున్న ఎకరం మడిలో సగం కయ్యలకే నీళ్ళు పారాయి. మిగిలిన సగం కయ్యల్లో, నిన్న పెట్టిన నీళ్ళు సగం ఇంకిపోయి, గొజ్జుగొజ్జుగా కనిపిస్తున్నాయి.

"య్యోవ్, సిద్దన్నా!" నారు పీకుతున్నవాళ్ళలో నుంచి గట్టిగా కేకేశాడు ఒక కూలీ.

సమాధానం లేదు.

"పందుంపుల్ల కోసరం పోయినట్లుండాడు లేరా" అన్నాడు మరో కూలీ.

"య్యోవ్, సిద్దన్నో!" మళ్ళీ అరిచాడతను.

"ఆఁ... ఏమబ్బా?" మళ్ళకవతలున్న చెట్లల్లో నుంచి కానుగు పుల్లతో పళ్ళు తోముకుంటూ వస్తూ అన్నాడు సిద్ధప్ప.

"మిసనాగిపోయి శ్యానా సేపాయెనే."

ఆ మాట వినగానే అతని గుండెలో రాయి పడ్డట్టయింది.

అటు చూశాడు.

శత్రు మూకలతో యుద్ధం చేసి, సాయంత్రానికి క్షతగాత్రుడై, అలసిపోయి ఆదమరచి నిద్రిస్తున్న వీరయోధుడిలా బావి గట్టున మిషన్...

గబగబా మిషన్‌కాడికి వెళ్ళాడు సిద్ధప్ప.

చచ్చిపడి ఉన్న మోయలేని బర్రె శరీరంలా ఉంది మిషన్.

ఆయిల్ ట్యాంక్ మూత తీసి, పక్కనే పడి ఉన్న ఒక ఈనపుల్ల తీసుకొని, అందులో ముంచి పైకి తీశాడు. ఆ ఈనపుల్ల సగం వరకు ఆయిల్ అంటుకొని నల్లగా కనిపించింది.

"ఆయిల్ ఫుల్లుగా ఉండాదే" అనుకొని తిరిగి మూత బిగించాడు.

ఆ తరువాత వీల్‌కి హ్యాండిల్ తగిలించి, కుడి చేత్తో వేగంగా తిప్పి, మిషన్ స్టార్ట్ చేసి చూశాడు.

ఊఁహూఁ. అది ఉలకలేదు, పలకలేదు.

ఆ వేళ అది పొట్టనిండా తిని గాఢంగా నిద్రపోయే కుంభకర్ణుడిలాగా కనిపించింది.

'మళ్ళా రిపేరుకొచ్చినట్టుండాదే. ఇంకెట్లబ్బా?' అనుకున్నాడు.

మడి వైపు చూశాడు.

నీళ్ళు పెట్టిన కయ్యలు వేలు లోతు నీళ్ళతో అద్దంలా నిగనిగా మెరిసిపోతున్నాయి. కొత్త పెళ్ళికూతురి శరీరం నుంచి వచ్చే గంధపు వాసనలా... ఆకు కుళ్ళిన కయ్యల నుంచి వస్తున్న కమ్మటి వాసన ముక్కుపుటాలకు నమ్మగా తాకుతోంది. మరో వైపున నారు పీకేవాళ్ళు తమ చేతుల్ని, చేతి వేళ్ళని వేగంగా కదిలిస్తూ నారు పీకుతుంటే, రొట్టెకు చుట్టుకున్న చీమల మాదిరి కనిపిస్తున్నారు. అప్పటికే మునాలు పట్టుకొని ఆడవాళ్ళు నాట్లు ప్రారంభించారు.

పని వేగంగా జరిగిపోతోంది.

'ఇప్పుడేం చేయాల్రా దేవుడా?" అనుకుంటూ బావిలోకి తొంగి చూశాడు. ఆ వేళ అది ఎక్కడో పాతాళంలో నుంచి భూమిపైకి విచ్చుకున్న వింత పిశాచి గహ్వరంలా తోచింది. బావిలో ఎక్కడో అడుగున ఉన్న నీళ్ళు అతని కళ్ళకి అందీ అందని మాయ లేడిలా తోచాయి. ఆ నీళ్ళను నమ్ముకొని మడి దున్ని సాపుచేసి, ఎరువులు వేసి చిన్న సంబా వడ్ల నారు పోసుకున్నాడు. నారు జానెడెత్తు పెరిగిన తర్వాత నాట్లు ప్రారంభించాడు.

'ఎట్ల లేదన్నా ఇంక డెబ్బయి దినాలకు పైగానే మడికి నీళ్ళు పారాల. అన్ని దినాలు బాయిలో నీళ్ళుంటాయా? ఇది సక్రమంగా కాపాడకొస్తాదా? మద్దెలో తడారిపోతే ఎట్లా?'

అతని ఆలోచనలు కందిరీగలయ్యాయి. అదేపనిగా మెదడును కుట్టసాగాయి.

'అది పేరుకు పెద్దబావేగానీ, దాంట్లో జల పెద్దగా లేదు. తన చిన్నతనంలో ఎంత కరువొచ్చినా ఎండేది కాదు. ఎన్నో కరువుల్లో ఎన్నో తరాలు ఆ బావి నీళ్ళుతాగి జీవం నిలుపుకున్నట్లు తల నెరిసిన పెద్దవాళ్ళు చెప్పుకుంటుంటే వినే ఉన్నాడు. కానీ,

> బావిలో నీళ్ళు పూర్తిగా తగ్గిపోయాయి. "ఇంక ఇరవై దినాలట్ల పారితే పంట సేతికొచ్చేస్తుందే. ముండ దేముడా! కండ్లు దెరిచి అట్ల నాలుగు చినుకులు రాల్చరా." కోపంతో దేవుణ్ణి తిట్టిపోశాడు.

ఇప్పుడు దానికీ వర్షమే ఆధారమైంది. అందువల్లనే ఆ బావి కింద సక్రమంగా మడి సాగి పదేండ్లు పైనే అయింది.

ప్రతి సంవత్సరం పేరుకు నాలుగు చినుకులు పడడం, అంగుళం నేలకు మించి తడవకపోవడం, కాదూ కూడదంటే ఏ రెండుమూడేళ్ళకో ఒకసారి వర్షం కాస్త బాగానే పడిందనిపించుకోవడం పరిపాటి. కానీ, చెరువులు, బావులు నిండిన పాపాన పోలేదు.

ఎప్పుడో అరుదుగా బావుల్లోకి అన్ని నీళ్ళు చేరితే, వాటిపైన నమ్మకంతో నారు పోసుకుని మడి దున్ని నాటుకోవడం, నాటిన మడి ఏపుగా పెరిగి, వెన్ను పడేటప్పుడు కుండ పగిలిపోయినట్టు, నోటికాడి చెయ్యి జారిపోయి కిందపడి నేలపాలైపోయినట్టు... పండేముందు ఎండిపోవడం, అంతవరకూ అపురూపంగా పెంచుకున్న వరితాలు కోసి గొడ్లకేసేయడం జరుగుతూనే ఉంది.

పోనీ బావి లోతు చేయిద్దామన్నా, చుట్టుపక్కల బావుల్లో బోర్లు వేయించేయడం వల్ల, లోతు చేసినా ఫలితం దక్కుతుందనే ఆశ లేదు. అలాంటప్పుడు బోరే వేయించుకోవచ్చు కదా అంటే, కనీసం మూడు వందల అడుగుల పైన దిగితేగానీ జల కనిపించే సూచన లేదని బోర్లు వేయించుకున్న రైతులు అనుభవం పైన చెప్పే మాట. ఎలాగో ఓ లాగు ధైర్యం చేసి వేయిద్దామన్నా జల పడుతుందన్న గ్యారంటీ లేదు.

అలాంటప్పుడు నీళ్ళు పడితే సరిపాయ. లేకుంటే ఆత్మహత్యే శరణ్యం. ఈ ప్రాంతంలో మడి సేద్యం సరయిన ఆలనా పాలనా లేక సాగినా సాగు చేసేవాళ్ళు లేక నేల సత్తువ తేలిపోయింది. మళ్ళలో ఎడారి చిహ్నాలు కనిపించసాగాయి. పోనీ, వ్యవసాయం వదిలేసి వేరే పని చేసుకుందామన్నా వేరే పనులు ఏవీ లేవు. పైగా తనకి తెలిసింది ఒక్క వ్యవసాయం పనులు మాత్రమే. ఊళ్ళో ఏ ఒక్కరిద్దర్నో వదిలేస్తే, వీసమెత్తు అటూ ఇటూగా అందరి పరిస్థితీ అదే. ఈ పరిస్థితులకు తోడు పెద్ద బిడ్డ పెళ్ళికెదిగి చాలా ఏళ్ళే అయింది. ఆమెకు పెండ్లి చేయాలి. ఆ తర్వాత రెండేండ్లకు ఆలస్యంగానైనా చిన్న పాపకు, ఆపైన కొడుకుకు పెండ్లిండ్లు చేయాల్సిందే.

"ఏమ్యాయోవ్! నారుమడిలో నీళ్ళు తగ్గిపోయుండాయి. నారు పీకేది కష్టంగా ఉండాది. నీళ్ళొదులయ్యా."

ఒక కూలీ వేసిన కేకతో ఇహంలోకొచ్చాడు సిద్ధప్ప.


అతని హృదయం నొప్పిగా మూలిగింది.

'ఇంక ఊరికే ఉంటే లాభం లేదు. పని జరగాల' అనుకొని కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. పీరూ సాయిబు దగ్గరికి పరిగెత్తాడు.

ఆ ఊళ్ళో ఉన్న ఏకైక మెకానిక్ పీరూ సాయిబు. అతన్ని బతిమాలి బామాలి పిల్చుకొచ్చాడు. పీరూ సాయిబ్ మిషన్‌విప్పి "అయ్యా! కొన్ని పార్టులు నిండా అరిగిపోయినాయి. కొత్తవి తెచ్చి ఏస్తేగానీ పని జరగదు" అన్నాడు.

"అరే! పని బందయిపోతుంది. మొత్తం ఎంత కావచ్చు పీరాం?" అడిగాడు సిద్ధప్ప.

"ఈసారికి అందాజుగా వెయ్యి రూపాయలు కావచ్చు భాయ్."



చెప్పాడు పీరూ సాయిబు.

'అయ్యో! అంతవుతుందా? యాడ సమాలించేదబ్బా!' మనసులోనే అనుకున్నాడు సిద్ధప్ప.

'అసలు మొదట, ఎనిమిదేళ్ళప్పుడు ఈ ఆయిల్ మిషన్ కొనడానికి, కూతురి పెళ్ళికని చేయించి పెట్టుకున్న బొట్టు చైన్ కైంకర్యం అయిపోయింది. ఆ తర్వాత దాని రిపేరుకనీ, ఇతర అవసరాలకనీ, దానికనీ, దీనికనీ ఇంట్లో ఉన్న విలువైన వస్తువులన్నీ క్రమంగా చెల్లిపోయాయి. మరిప్పుడు రిపేరుకు



చిత్రాలు: నర్సిం

ఎక్కడి నుంచి తేవాలి?' అతనికేమీ అర్థం కాలేదు.

"ఏం పీరాం? కొత్త పార్టులేడ తేచ్చేది గానీ, ఈసారికెట్లో అట్ల సరిచేయబ్బా!" అర్థింపుగా అన్నాడు సిద్ధప్ప.

"చూడు భాయ్! వద్దంటే కిరసనాయలు పోస్తావస్తివి. పార్టులన్నీ అరిగిపోయినాయి. ఏమీ చెయ్యలేం. నేను చెప్పినవి తే. రిపేరు చేస్తా. లేకుంటే లే." కచ్చితంగా చెప్పేశాడు పీరూ సాయిబు.

"అయ్యో! అట్లంటివేంది సామీ? మునుగులో గుద్దులాటెందుగానీ, నా దెగ్గిరిప్పుడు ఎఱ్ఱ నయాపైసా లేదు." తన పరిస్థితిని విన్నవించుకున్నాడు సిద్ధప్ప.

"చూడు భాయ్! దీంతో యాగడమంటే ఏనుగును సాకినట్లే. చెప్తే ఇనవు. ఈ బాధ కంటే కొత్తది కొనుక్కోవచ్చు కదా!"

కొత్త మిషన్ కొనుక్కునే శక్తే ఉంటే, దీంతో పీకులాటేల? సరే. పల్లికి బొయ్యి ఎట్లో ఒగట్ట సమాలించుకోనొస్తాగానీ మిగిలినవి సూస్తా ఉండు" అంటూ తలగుడ్డ విదిలించి భూజాన వేసుకుని ఇంటి ముఖం పట్టాడు సిద్ధప్ప.

ఇంట్లో చివరగా మిగిలిన భార్య చేతిలోని వంకీ ఉంగరాన్ని తాకట్టు పెట్టి దుడ్డు తీసుకువచ్చి పీరు చేతిలో పోశాడు. పీరూ సాయిబు పేటకెళ్ళి సామాన్లు తీసుకొచ్చి మిషన్ రిపేరు చేసేటప్పటికి మధ్యాహ్నం మీరిపోయింది. అప్పటివరకూ ఊరికేనే ఉన్న కూలీలు సద్దేళన్నం ముగించుకొని పైటేళన్నం కోసం చూస్తున్నారు.

సరిగ్గా అప్పుడే అతని భార్య ఎల్లమ్మ రాగి సంకటి కెలికి, దాంట్లోకి శనిగ్గింజల చట్నీ, అలసంద బేడల పులగూర వండి తట్టలో పెట్టకొని పైటేళన్నం తెచ్చేసింది.

మిషన్ రెడీ చేసి, స్టార్ట్ చేసి, చేతులకంటుకున్న ఆయిల్ని పాత గుడ్డతో తుడిచి, చేతులు శుభ్రం చేసుకుని, కూలీలతోపాటు అక్కడే ఒక ముద్దన్నం తినేసి, "సిద్దప్పా! ఈ గోస్టెందుగ్గానీ దీన్ని అమ్మెయ్. లేకంటే ఇది నీ కొంప తినేస్తుంది" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు పీరూ సాయిబు.

ఎలాగో మళ్ళలో నాట్లు పూర్తిచేశాడు. ఆ తర్వాత ఎరువులు కొని తెచ్చి వేశాడు.

పుట్టిన కొద్ది రోజులకి తల్లిపాలు తాగి పురిటి రక్తంతోపాటు కొత్త రక్తాన్ని తెచ్చుకుని కళకళలాడే పసిబిడ్డలా, నాటిన పైరు నిలదొక్కుకుని పచ్చదనం నింపుకోసాగింది. మళ్ళీ ఎరువులు తెచ్చి వేశాడు. దాంతోపాటు శనగపిండి, పేడ వేసి కలుపు తీయించాడు. పైరు గంటలు గంటలుగా పెరిగి సన్న గరుగు పైకొచ్చింది. నీళ్ళే కనిపించనంతగా బలుచుకుంది. మడంతా పచ్చదనం పరిచినట్లు పైరు నిగారిస్తోంది. \

ఆ పైరు అలాగే పండిందంటే అన్ని నాళ్ళ తన దరిద్రం తీరిపోయినట్లేననుకున్నాడు. ఆ పైరును చూసినప్పుడంతా అతని కడుపు చల్లగవుతోంది. కానీ, బావిలో నీళ్ళు సగానికి తగ్గిపోవడంతో అతనికి ధైర్యం సన్నగిలసాగింది.

ఆకాశం వైపు చూసి, ఒక నిట్టూర్పు విడిచి, 'ఈసారన్నా అట్ల గట్టెక్కించరా అన్నేకారి దేముడా!' అనుకుంటూ కనిపించని దేవుడికి మొక్కుకుంటూనే ఉన్నాడు.

నూత్న యౌవనంలోకి అడుగు పెడుతున్న అబ్బాయిలా ఏపుగా పెరగసాగింది పైరు. రోజులు గడిచేకొద్దీ బావిలో నీళ్ళు అందడం లేదు. ఫలితంగా పైరుకు తగినన్ని నీళ్ళు పారడం లేదు. రోజూ పెట్టాల్సిన నీరు రోజు మార్చి రోజు పెట్టాల్సి

వచ్చింది. దానికి తోడు మిషన్ మళ్ళీ ఒకసారి ట్రబులిచ్చింది. దాంతో రెండు రోజులు తడారిపోయింది. పైరు పచ్చదనపు నిగారింపు దెబ్బతినసాగింది.

ఇంతలో ఉన్నట్టుండి ఆకాశంలో గర్జాలు లేసి నాలుగు చినుకులు పడ్డాయి. బావిలో నీళ్ళు మరికొన్ని వచ్చాయి. సిద్దప్పకు మళ్ళీ ఆశలు చిగురించాయి. కానీ, శనిపట్టినవాడికి శతకోటి దరిద్రాలన్నట్టు ఉన్న దెబ్బకు తోడు మడికి అగ్గి రోగం తగిలింది. ఆకులు ముడుచుకుపోయి, పసుపు వర్ణంగా మారి కర్రలు ఊనుపోసాయి. చూస్తుండలేకపోయాడు సిద్దప్ప. మళ్ళీ అప్పు చేసి కల్లూరికెళ్ళి మందులు, ఎరువులు కొని తెచ్చి చల్లాడు.

దీర్ఘరోగం నుంచి కోలుకున్న వ్యక్తిలా, పైరు అగ్గిరోగం నుంచి బయటపడింది. క్రమంగా తేరుకొని నల్ల గరుగు మీదికి వచ్చింది.

అయినా, సిద్దప్ప ధైర్యం విడువలేదు. మళ్ళీ వర్షం పడకపోతుందా అన్న ఏదో ఆశ. ఏదో ఆరాటం. ఎలాగైనా పంటను దక్కించుకోవాలన్న పట్టుదల.

ఆ పట్టుదలతోనే పంచాయతీ ఆఫీసులో గవర్నమెంట్ వారు రైతులకు సబ్సిడీ రేటుకు ఎరువులు అమ్ముతున్నారని తెలుసుకొని వెళ్ళి ఎరువులు తెచ్చి ఎకరం పైరుకూ చల్లాడు. బావిలో నీళ్ళు బొటాబొటిగా ఆ ఎకరం నేలకూ అందుతున్నాయి.

సిద్దప్ప రేయింబగళ్ళు అదేపనిగా బావిదగ్గరే ఉన్నాడు. కళ్ళలో వత్తులు వేసుకుని ఊరిన నీళ్ళను ఊరినట్లే మిషన్ వదిలి పైరుకు పెడుతున్నాడు. తన పంచప్రాణాలన్నీ నీళ్ళపైనే పెట్టుకున్నాడు. పైరు పొట్టకొచ్చింది.

ప్రతి కర్రా తన ఆకుల ఒడిలో, పచ్చని లేత ఎన్నును దాచుకొని మోస్తూ, నెలలు నిండిన నిండు గర్భిణిలా కనిపించసాగింది.

'ఇక ఇప్పటి నుంచీ పైరుకు నీళ్ళు సమృద్ధిగా పారాలి. లేకుంటే వడ్లగింజల్లో బీప గింజ సగం వరకే పండుతుంది' అనుకుని వర్షం కోసం ఆకాశం వైపు ఎగజూస్తూ గడపసాగాడు సిద్దప్ప.

బావిలో నీళ్ళు పూర్తిగా తగ్గిపోయాయి. అడుగున ఏదో కొద్ది నీళ్ళు మాత్రం ఊరుతున్నాయి.

'ఇంక ఇరవై దినాలట్ల పారితే పంట సేతికొచ్చేస్తుందే. ముండ దేముడా! కండ్లు దెరిచి అట్ల నాలుగు చినుకులు రాల్చరా.' కోపంతో దేవుణ్ణి తిట్టిపోశాడు.

తిట్లకు వానలు కురిసేట్టయితే వారానికొక తిట్ల పండుగ జరుపుకునేవాళ్ళు ప్రజలు.

మరోవైపు గుర్తుకు వచ్చిన ప్రతి దేవతకీ మనసులోనే మొక్కుకున్నాడు సిద్దప్ప.

మొక్కులకు పైర్లు పండేట్టయితే ఊరికొక్క గుడే కాదు, ఇంటింటికీ ఒక దేవాలయం వెలిసేది.

ఏ దేవుడూ అతన్ని కనికరించలేదు. బావిలో ఉన్న ఆ కాస్త చెమ్మా తగ్గిపోసాగింది. వడ్లల్లో బీపగింజ దిగి, అది పెరిగి, ముదిరే సమయంలో పూర్తిగా నీటి కొరత ఏర్పడింది.

సరైన పౌష్టికాహారం లేక రక్తహీనతకు గురైన నిండు చూలాలిలా పైరు క్రమంగా పసుపు రంగును సంతరించుకోసాగింది.

'అయ్యో! ఇన్ని నాళ్ళ చేతికష్టం బూడిదలో కలిసిపోతుందే' అన్న బాధ ఒకవైపు, రేపోమాపో అన్ని చినుకులు రాలకపోతాయా అన్న ఆశ ఇంకోవైపు...

అతని మనసు గిలగిలలాడిపోయింది.

చివరి దశలో పూర్తిగా మడి తడారిపోయింది.

ఎలాగైతేనేం, చచ్చీచెడీ పంట పండిపోయింది. మడి కోయించి కుప్ప వేయించాడు.

వరికుప్ప ఎత్తుగా ఒక చిన్నపాటి చుట్టుగుడిసెలా కనిపిస్తోంది. నాలుగు రోజులు కుప్ప మగ్గిన తర్వాత, కుప్ప పక్కనే, వరి కోళలు పీకి, మట్టి అణగదొక్కి, దిమ్మిసా కొట్టి, పేడనీళ్ళు చల్లి కళ్ళం తయారు చేశాడు.

అదే రాత్రి నలుగురు కూలీలను పిలిపించుకొని కుప్ప కొట్టడం ప్రారంభించాడు. సందెడు సందెడు వరితాలు మోపులుగా చుట్టుకొని నెలకేసి కొడుతుంటే, వడ్లు జల్లున రాలుతున్నాయి. కుప్పలుకుప్పలుగా రాలుతున్నాయి.

క్రమంగా వరికుప్ప తరిగిపోయి, వడ్లకుప్ప పెరగసాగింది. తెల్లారేసరికి కుప్ప కొట్టడం పూర్తయింది.

తూర్పున పటమెగిరేసరికి వడ్లు రాలిన వరితాలు కుప్ప ఒకవైపు. రాలిన వడ్లకుప్ప మరోవైపు.

తూర్పు కొండల్ని ఎర్రబరుస్తూ, సూర్యుడు ఉదయించి, పొద్దు బారెడెక్కిది.

ఆశగా వడ్లకుప్పను చూశాడు సిద్దప్ప.

అది గుంటకు మూట రాలే నేల.

ఎట్ల లేదన్నా ఆ ఎకరం నేలకు ఇరవై మూటలు పండాల్సిన వడ్లు... నాలుగు మూటల కంటే ఎక్కువ రాలలేదు. అతనికి చాలా చిన్నతనంగా అనిపించింది. తల తీసేసినట్లనిపించింది.

వంగి వడ్లను దోసెట్లోకి తీసుకొని పరిశీలించాడు. అతని హృదయం మరోసారి బాధగా మూలిగింది.

అందులో సగం జల్లొడ్లు!

గింజ పట్టక తెల్లగా గింజకపోయిన వడ్లు!

ఆ నాలుగు మూటల్లో మిగిలిన గట్టి గింజలు ఎన్ని?

కేవలం రెండు మూటలు.

అతనికి కడుపులో కడివెడు నిప్పులు పోసినట్టు మండిపోయింది. ఎవరో అజ్ఞాత వ్యక్తి కడుపులో చేయి పెట్టి దేవినట్లనిపించింది.

"రేయింబగళ్ళు నిన్నే నమ్ముకొని పండిస్తే, కడుప్పయిన తంతివే. తూ" అని ఆ వడ్లను అలాగే విసరి కుప్పలోకి చల్లేశాడు.



ఆ తర్వాత తాలు దగ్గరకు వచ్చి పిడికెడు తాలును చేతుల్లోకి తీసుకొని కొసల్ని పరిశీలించాడు.

ప్రతి గొలకలోను పాతిక భాగం గింజలు రాలకుండా అలాగే ఉండిపోయాయి. వడ్లు ఎందుకు ఎక్కువ రాలలేదో అతనికి అప్పుడుగానీ అర్థం కాలేదు.

కడుపులో కడివెడు నిప్పులు పోసినట్టు మండిపోయింది. "రేయింబగళ్ళు నిన్నే నమ్ముకొని పండిస్తే, కడుప్పయిన తంతివే. తూ" అని ఆ వడ్లను అలాగే విసరి కుప్పలోకి చల్లేశాడు.

బాగా పండినవి కుప్పలో మగ్గి, కొట్టగానే రాలిపోయాయి. వాటితోబాటుగా జీవం లేని తెల్లజల్లులు జల్లున రాలిపోయాయి. కానీ, సగం పండీ సగం పండక ఇంకా పచ్చదనంతో కనిపిస్తూ అలాగే గొలకలకు అతుక్కుని ఉండిపోయాయి తాలుగింజలు. ఎందుకూ పనికిరాని తాలుగింజలు.

నిరాశగా ఒక్క నిట్టూర్పు విడిచాడు సిద్దప్ప. క్రమంగా అతని గుండె బాధతో బరువెక్కింది. అతని శరీరంలోని అణువణువూ నేలలోకి కుంగిపోయినట్లనిపించి కళ్ళు చెమ్మగిలాయి.

చెమ్మగిలిన ఆ కళ్ళ ముందర ప్రతి ఏడూ విడవకుండా వస్తున్న కరువులు, అర్థాకలితో అలమటించే కుటుంబాలు, పడీపడని వర్షాలు, వాటిని నమ్ముకొని చేసే సేద్యాలు, రోజురోజుకీ పెరిగే ధరలు, వాటికనుగుణంగా ఎదిగే అప్పులు- అన్నీ క్షణకాలం పాటు గిర్రున తిరిగాయి.

'ఈ గడ్డన, సగం పస్తులతో అలమటించే రైతులు, లోలోపల సగం డొల్లతనాన్ని నింపుకుని పైకి బాగానే కనిపించే తాలు గింజలే! ఎంత కొట్టినా వరి తాలును వదలక సగం పచ్చదనంతో ఎందుకూ పనికిరాకుండా నిలిచిపోయిన తాలుగింజలు!' అనుకున్నాడు.

గుండె మండింది! బుర్ర తిరిగింది!

ఆ తాలుగింజల వరిగడ్డిపైన అలాగే ఒరిగిపోయాడు సిద్దప్ప. అప్పుడే ఆకాశంలో పోటమరించిన ఓ మబ్బుతునక అతన్ని చూసి వెర్రిగా నవ్వింది! ■